క్లుప్తంగా

బింగినపల్లి చెరువు తూముల పరిశీలన



బింగినపల్లి చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి చెరువును ఇరిగేషన్ ఏఈ మధుబాబు శుక్రవారం పరిశీలించారు. చెరువు తూముల గోడలు బాగానే ఉన్నాయని, చెక్కలు మార్చాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మాట్లాడుతూ.. చెరువులోకి పక్కనే ఉన్న రొయ్యల చెరువుల నీటి ఊట వస్తుండటంతో పంటలు సక్రమంగా పండటం లేదని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలిపి వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటానని ఏఈ వివరించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్,రైతులుపాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా బీటీఏ



హెచ్‌ఎంపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో సభ్యతాలు చేయిస్తున్న నాయకులు

హనుమంతునిపాడు: ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడే యూనియన్ బహుజన టీచర్స్ అసోసియేషన్ అని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు దద్దాల శ్రీనివాసులన్నారు. శుక్రవారం వేములపాడు, హనుమంతునిపాడు, ఏలికవారిపల్లి, తదతర గ్రామాల్లోని పాఠశాలలో 50 ఉపాధ్యాయులను బీటీఏ సంఘంలో సభ్యత్వాలు చేరిపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విజయవంతం చేయాలన్నారు. కేజీబీవీలో ఉన్న ఒప్పంద ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారానికి సంఘం పని చేస్తుందన్నారు. మోడల్ స్కూల్‌లో కాంట్రాక్టు ఉపాధ్యాయుల రెగ్యులరైజ్ చేయాలని, ప్రతి హైస్కూల్‌లో గ్రేడ్ 2హెచ్‌ఎం పోస్టుని మంజూర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు చీమలదిన్నె చిన్న వెంగయ్య, టీఐ ప్రతాప్, దేపూరి వెంకటేశ్వర్లు, మర్రి మోషే, ఆర్.దయన్న, బి. సుబ్బారావు, బి.నాగయ్య, రామయ్య పాల్గొన్నారు.

రైతు సమస్యలపై స్పందించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి

కనిగిరి రూరల్: ప్రచారాలకు పరిమితం కాకుండా.. రైతుకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారిని గౌరవించి సమాధానం ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రైతులకు 50 శాతం రాయితీ పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఏడీఏ ఈ వెంకట రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా రెడ్డి మాట్లాడుతూ రైతు సమస్యలపై స్పందించని అధికారులపై తప్పక చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వ్యవసాయ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుని తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందాలన్నారు. 3 వేల టన్నుల పచ్చిరొట్ట విత్తనాలు మంజూరయ్యాయని వెల్లడించారు. ఏఎంసీ చైర్మన్ చింతంగుంట్ల సాల్మన్ రాజు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఏఓలు జోత్స్న దేవి, రాధ, శిల్ప, రంగ కృష్ణా, వెంకట స్వామి, గోపి కృష్ణా, పుల్లయ్య, షారుక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

సీఎస్‌పురం (పామూరు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సాయంగా దాతలు తమ సొంతనిధులతో నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఎంఈవో రాజాల కొండారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ముళ్లపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నతపాఠశాలలో శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం కె.చెన్నయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలతో పాటు,దాతలు మూసాని చిన్న చెన్నారెడ్డి, శివారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, చెన్నక్రిష్ణా రెడ్డి సమకూర్చిన నోట్ పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ, వాటర్‌బాటిల్స్, పెన్సిల్స్ అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో గ్రామస్తులు పాలుపంచుకోవడం శుభపరిణామమన్నారు. ఎంపీయూపీ పాఠశాలలో హెచ్‌ఎం బి.శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అదేగ్రామానికి చెందిన విశ్రాంత హిందీ పండిట్ రుసుం ఖాజావలి జ్ఞాపకార్థం వారి కుమారులు ఆర్‌కే వలి సోదరులు సమకూర్చిన నోట్‌పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. పాలుగుళ్ల వెంకటేశ్వరరెడ్డి, పీఎంసీ చైర్మన్ రామచంద్రారెడ్డి, తిరుపతయ్య, గాంధీ, వినీల, మారెళ్ల రవికుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



పామూరు: విశిష్ట అలంకరణలో అచ్చమాంబ మూల విగ్రహమూర్తి



లింగసముద్రం:ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి



లింగసముద్రం: ప్రత్యేక అలంకరణలో మాత

పామూరు: మండలంలోని కమ్మవారిపాలెం, రఘునాథపురం అచ్చమాంబ పేరంటాళ్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు శుక్రవారం కలశపూజ, చండీహోమం రుత్వికులు కొల్లూరి రవికిరణ్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి మూల విగ్రహమూర్తికి, ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం కలశపూజ, చండీ హోమం నిర్వహించి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అడుసుమల్లి చంచయ్య, నరసింహులు, తిరుపతయ్య, దుద్దుకూరి యోగానంద్, మల్లికార్జున, రావిళ్ల వెంకటరత్నం, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్లు

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామంలో పోలేరమ్మతల్లి, సీతలమాత బొడ్డురాయి తృతీయ వార్షిక మహోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు తిరునాళ్లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పోలేరమ్మతల్లి గుడికి ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం పోలేరమ్మ తల్లికి, సీతాలమాతకు కుంకుమార్చన చేసిన అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం శాంతి హోమాలు, అమ్మవారి గ్రామోత్సవం, బండ్ల ఊరేగింపు, ఆదివారం అమ్మవారికి పొంగళ్లు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ మూడు రోజులు మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కూడా తెలిపారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పామూరు: చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

చిన్నారుల విద్యాభివృద్ధికి కృషి



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: వసతి గృహాల్లోని విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక శివనగర్ కాలనీలోని షెడ్యూల్ తెగల బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పారిశుద్ధ్యం, నీటి సమస్యను చైర్మన్‌కు వివరించారు. హాస్టల్ విద్యార్థుల నీటి సమస్య పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రిన్సిపాల్ గురుస్వామి రెడ్డి, ఏఎస్‌ఎం వాసు, వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్న ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.358



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

కొండపి(సింగరాయకొండ): కొండపిలోని స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలో శుక్రవారం అనకర్లపూడి, ముప్పరాజుపాలెం, మిట్టపాలెం, పెరిదేపి గ్రామాలకు చెందిన రైతులు 880 బేళ్లు వేలానికి తీసుకురాగా అందులో 821 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 59 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.292.27 పలికింది. వేలంలో 27 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: పొగాకు రైతులు వేలం కేంద్రానికి తెచ్చే బేళ్లు 150 కేజీలు మించరాదని, అలాగే అన్యపదార్థాలు, న్యూస్ పేపర్లు లేకుండా తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాదువారిపాలెం గ్రామాల రైతులు 1,098 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 1047 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.359 పలకగా, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.294.29 పలికింది. వేలంలో మొత్తం 41 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటరత్నం

సింగరాయకొండ: మండలంలోని కలికవాయ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ చిడిపూడి వెంకటరత్నం మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు నిడమానూరి సురేంద్ర మాట్లాడుతూ.. పాఠశాలలో 90 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నారని వివరించారు. మాజీ సర్పంచ్ మందలపు గాంధీచౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం కిషోర్‌కుమార్

మద్రిపూడి: గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించడమే విద్యా వికాస్ ట్రస్టు లక్ష్యమని ఇన్‌చార్జి హెచ్‌ఎం బీడీ కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులకు ట్రస్టు ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. ఏటా ఎస్‌ఏ రైటింగ్, జీకే పరీక్షలు నిర్వహించి 20 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. నెన్నూరుపాడుకు చెందిన దాత డాక్టర్ రామకృష్ణారెడ్డి విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి, పేద విద్యార్థులను ప్రోత్సహించే దృక్పథంతో 10వ తరగతిలో 564 మార్కులతో పాసైన విద్యార్థినిని ఒంగోలు ప్రతిభా కళాశాలలో చేర్పి రూ.60 వేలు చెల్లించేందుకు అంగీకరించడం సంతోషకరమన్నారు. అనంతరం నైతిక విలువల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ట్రస్టు సమన్వయకర్త కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7 ఆటోలు సీజ్



పత్రాలు పరిశీలిస్తున్న ఏఎంవీఐ జయప్రకాష్

పామూరు: సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 7 ఆటోలను సీజ్ చేసినట్లు ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎంవీఐ కె.జయప్రకాష్ అన్నారు.పామూరులో శుక్రవారం సాయంత్రం ఆయన పలు వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు విధిగా వారు డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని, అదేవిధంగా వాహనాలకు కూడా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్యాసింజర్‌ను అధికంగా తరలిస్తున్నా, మద్యం సేవించి వాహనాన్ని నడుపుతున్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీజ్ చేసిన వాహనాలను స్టేషన్‌లో అప్పగించారు. షేక్ అబ్దుల్ ఖాదర్, సిబ్బంది ఉన్నారు.

సాయికుమార్ సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి(సింగరాయకొండ): సీనియర్ గ్రేడింగ్ అధికారి టి.సాయి కుమార్ సేవలు ఎనలేనివని కొండపి బోర్డ్ వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయికుమార్ పదవీ విరమణ సందర్భంగా కొండపి పొగాకు బోర్డులో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ.. గత 40 ఏళ్లుగా సాయి కుమార్ రైతుల సేవలో మమేకమయ్యారని, వివిధ ప్రదేశాల్లో విధులు నిర్వర్తించి మంచి పేరు సంపాదించారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సెక్రటరీ ఎస్.మధుసూదన్, బోర్డ్ మెంబర్ బొడ్డపాటి బ్రహ్మయ్య, ఎరువుల కమిటీ అధ్యక్షుడు కల్లూరి హరిబాబు, పొగాకు కంపెనీ మేనేజర్లు, బయ్యర్లు, కొండపి పొగాకు రైతు సంఘం నాయకులు, బోర్డ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం



సన్మాన సభలో జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, ఎంఈఓలు

కనిగిరి రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పదవీ విరమణ, బదిలీలు సహజమని జెడ్పీటీసీ మడతల కస్తూర్బా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 7వ వార్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు అన్నపురెడ్డి వేదవతి పదవీ విరమణ సన్మాన సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు యువీ నారాయణరెడ్డి, డీవీ సుబ్బారావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

1వ తేదీన నూరు శాతం పెన్షన్లు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగమణి

కొండపి(సింగరాయకొండ): సచివాలయ ఉద్యోగులు జూన్ 1వ తేదీన నూరు శాతం పెన్షన్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ నాగమణి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పెన్షన్ పంపిణీకి నియమితులైన ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి విధుల్లో ఉండి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇవ్వాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెన్షన్‌దారులు ఇళ్ల వద్ద ఉండి ఉద్యోగులకు సహకరించాలని కోరారు.



విద్యార్థులను అభినందిస్తున్న మానవతా సంస్థ ప్రతినిధులు

ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు

కనిగిరి రూరల్: ఇంటర్ విద్యలో స్టేట్ ర్యాంకులు సాధించిన స్థానిక విజేత కళాశాలల విద్యార్థులను మానవతా సంస్థ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటర్ విద్యలో కనిగిరికి చెందిన విజేత కళాశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థానంలో ప్రతిభ చాటడాన్ని కొనియాడారు. బైపీసీ విభాగంలో సయ్యద్ అస్మిన్, ఎస్కే నజ్మా 435 మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంక్‌లు, రవీంద్ర స్టేట్ 5 వ ర్యాంక్ సాధించడాన్ని కొనియడారు. ఎంపీసీ విభాగంలో గడా కీర్తన 465 మార్కులు స్టేట్ 3వ ర్యాంక్, రోహితా, వైష్ణవి 460 మార్కులతో స్టేట్ 8వ ర్యాంక్‌లు సాధించడం అభినందనీయమన్నారు. ఈ మేరకు ప్రతిభ చాటిన విద్యార్థులకు రూ. 10 వేలు ప్రోత్సాహక నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజేత కళాశాల కరస్పాండెంట్ పసుపులేటి అరుణోధర్, మాంటిస్సోరీ స్కూల్ కరస్పాండెంట్ పిచ్చిరెడ్డి, సంస్థ ప్రతినిధులు పసుపులేటి వాణి, వాగి చర్ల వెంకటేశ్వర్లు, తాళ్లూరి వెంకటేశ్వర్లు, బొగ్గరపు శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ శ్రీ రాములు, మాధవ, సంజీవయ్య, మస్తాన్‌వలి, గురుస్వామి పాల్గొన్నారు. అనంతరం దాత వాగిచర్ల వెంకటేశ్వర్లు ప్రతిభ చాటిన విద్యార్థులు డిక్షనరీ, పెన్నులు, నోట్ బుక్‌లు అందజేశారు. కళాశాలలోని ఒక నిరుపేద విద్యార్థినికి రెండేళ్ల ఫీజును తాను చెల్లిస్తానని ప్రకటించారు.

నర్సరీలను రిజిస్టర్ చేయించుకోండి



నర్సరీలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి అంజలి భాయి

కనిగిరి రూరల్: నర్సరీ యజమానులు తప్పని సరిగా తమ నర్సరీలను రిజిస్టర్ చేయించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి ఎం. అంజలీ భాయి అన్నారు. మండలంలోని చిన ఇర్లపాడులో ఉన్న నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి ఎం. అంజలి భాయి మాట్లాడుతూ నర్సరీ యాక్ట్ ప్రకారం ప్రతి రైతు నర్సరీలకు లైసెన్స్ తీసుకోవాలన్నారు. నర్సరీలో విక్రయించే విత్తనాలు, నారు మొక్కలు అమ్మకాలు, కొనుగోలు రసీదులు కచ్చితంగా ఉండాలని, తప్పని సరిగా రిజిస్టర్‌లు నమోదు చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తప్పని సరిగా చర్యలు ఉంటాయని వెల్లడించారు. ఈమేరకు లైసెన్స్ లేని నర్సరీల యజమానులకు శుక్రవారం నోటీసులు అందించారు. నర్సరీ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



హనుమంతునిపాడు: కస్తూర్బా పాఠశాలలో తాగు నీటి పరీక్షలు చేయిస్తున్న వైద్య సిబ్బంది

హనుమంతునిపాడు: పాఠశాలలో బాలికలు పరిసరాల పరిశుభ్రత తోపాటు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని మెడికల్ ఆఫీసర్ దార్ల సందీప్ అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తాగే తాగు నీరు, బాత్ రూంలు, వంటశాలలు, పాఠశాలలో తరగతి గదులు, విద్యార్థినిలు హాస్టల్ గదులు పరిశీలించారు. డయేరియాపై అవగాహన కల్పించారు. తాగు నీటి ట్యాంక్‌లు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయించాలన్నారు. వంట పాత్రలు, వంట శాలను పరిశుభ్రంగా ఉంచాలని.. వంటచేసి తరువాత పాత్రలపై మూతలు ఉంచాలన్నారు. సీహెచ్‌ఓ కేవిచెన్నయ్య, ఎస్‌ఓ ఇందిరా సుహాషిణి, ఎంఎల్‌హెచ్‌పీ విజయ్, హెల్త్ అసిస్టెంట్ జి.శ్రీను, తదితులున్నారు.

రికార్డుల నిర్వహణ ఉండాలి



వెలుగు కార్యాలయంలో ఆడిటింగ్ నిర్వహిస్తున్న ఆడిటర్‌లు

సీఎస్‌పురం (పామూరు): మండల, గ్రామ సమాఖ్య సంఘాలవారు రికార్డుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్వహణలో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఆడిటర్ యం.శ్రీనివాసరెడ్డి, ఏపీయం గంటా విద్యాసాగర్ అన్నారు. మండల కేంద్రమైన వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండల సమాఖ్య, గ్రామైక్య సంఘాలకు సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో పొదుపు, సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి, వీఆర్‌ఎఫ్, వాటర్‌షెడ్, గ్రామసంఘం నిధులు, వీఓఏ వేతనాలు, కార్యాలయ మెయింటెనెన్స్‌కు సబంధించిన రాబడి, చెల్లింపులపై ఆడిటింగ్ చేశారు. ఆడిటర్ యం.శ్రీనివాసరెడ్డి మండల, గ్రామ సంఘాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణలో నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా సంఘాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులు, ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేసి పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. డీయంజీ డి.సుబ్రహ్మణ్యం, సీసీలు ఇర్రి మస్తాన్‌రెడ్డి, యంవీ నారాయణమ్మ, కాశయ్య, అకౌంటెంట్ సువార్తమ్మ, వీఓఏలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



పామూరులో మాట్లాడుతున్న సీడీపీఓ సరోజిని

పామూరు: సమయపాలన పాటించని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలపై చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీఓ పి.సరోజిని అన్నారు. పామూరు, వగ్గంపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సెక్టార్ స్థాయి సమావేశం నిర్వహించారు. సీడీపీఓ పి.సరోజిని మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు తెరిచే ఉంచాలని ఉదయం కేంద్రం తీసిన వెంటనే గ్రూప్‌లో ఫొటోలు పెట్టాలన్నారు. కార్యకర్త యూనిఫాం విధిగా ధరించాలన్నారు. రికార్డులు, రిజిస్టర్ల అప్‌డేట్‌గా ఉంచాలని, పిల్లల వయస్సును బట్టి కేంద్రంలోని పిల్లలను విభజించి వారికి అనుగుణంగా ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, పార్వతి, వంకేశ్వరం వెంకట నాగవాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలు ఏర్పాటు చేయాలి



మంత్రి స్వామికి విజ్ఞప్తి చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మద్రిపూడి: అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు చేయించడంతోపాటు పలు చోట్ల శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డీబీవీ స్వామికి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మద్రిపూడిలో నిర్వహించిన సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంత్రిని కలిసి విన్నవించారు. మండలంలోని చిమట, జి.అగ్రహారం, అయ్యపరాజుపాలెం, సన్నమూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు చేయించాలని కోరారు.

డయేరియా నివారించండి

ఉలవపాడు: పాఠశాలల్లో విద్యార్థులకు డయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చాకిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రణతి అన్నారు. శుక్రవారం పెదపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు మంచినీరు వేడి చేసి చల్లబడిన తరువాత అందించాలని తెలిపారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం గ్రామ పెద్దలు వైద్యాధికారిని సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు సలీమ్‌బాషా తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కందుకూరు: ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్‌లు, సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి డాక్టర్‌లకు సూచనలు చేశారు. చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్ ఇంద్రాణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల అధ్యక్షుడు నార్నే రోశయ్య, నాయకులు చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, రఫీ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో మంత్రి తనిఖీ

కొండపి(సింగరాయకొండ): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని భోజనశాల, టాయిలెట్స్, లైట్ల గురించి మంత్రి ప్రశ్నించడంతో ప్రిన్సిపాల్ అరుణ తడబడ్డారు. సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.